క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని యాద్గర్‌పల్లిలో సబ్ స్టేషన్‌కు వచ్చే 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఇండస్ట్రీయల్ 2 ఫీడర్ పరిధిలో ఉన్న అన్ని రైస్ మిల్లులకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో రూరల్ ఏఈ బీ అమర్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఫీడర్ కింద ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ రమణారెడ్డి

డిండి: భూ భారతిలో భాగంగా రైతులు చేసుకున్న దరఖాస్తులకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి రెవెన్యూ సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతికి సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఆన్‌లైన్ పనుల అనంతరం భూ భారతి దరఖాస్తులు గ్రామాల వారిగా విచారణ చేపట్టాలన్నారు. ఆయన వెంటన ఆంజనేయులు, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ ముస్తాఫా తదితరులు ఉన్నారు.

సాగర్‌ను సందర్శించిన సచివాలయ ఉద్యోగులు


బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న అధికారుల బృందం

నాగార్జునసాగర్: తెలంగాణ రాష్ట్ర సెక్రటేరియట్‌లో వివిధ శాఖలకు చెందిన మహిళా సెక్షన్ అధికారులు శనివారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. మ్యూజియం, బుద్ధవనాన్ని పరిశీలించారు. బుద్ధవనంలో వీరిని ఎగ్జిక్యూటివ్ అధికారి శాసన శాలువాతో సత్కరించారు. ఎస్టేట్ అధికారి రవిచంద్ర బుద్ధవనం వివరాలతో కూడిన వీడియోను చూపించారు. వీరికి టూరిజం గైడ్ సత్యనారాయణ సాగర్ ప్రాజెక్టు వివరాలను, మ్యూజియం, బుద్ధవనం చరిత్రను వివరించారు. వీరితో ప్రొటోకాల్ ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

జూదరుల అరెస్ట్

చింతపల్లి : జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను శనివారం చింతపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం పోలేపల్లి రాంనగర్ గ్రామ శివారులో కొందరు వ్యక్తులు జూదం(పేక) ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుంచి రెండు బైక్‌లు, నాలుగు సెల్ ఫోన్లు, రూ.10,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

దేవరకొండ : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్ అన్నారు. శనివారం దేవరకొండ మండలం ఉమ్మడి కొండభీమనపల్లి గ్రామ పంచాయితీకి చెందిన పలువురు వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆయన కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాము నాయక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహ, వినోద్ రాథోడ్, రాములు, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయాలి

మిర్యాలగూడ టౌన్ : ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్న యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్య సమాజ మందిరంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నేత అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 14న వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సును నల్లగొండలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సదస్సుకు వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. వికలాంగులు పెద్దఎత్తున ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నేత దైద సత్యం మాదిగ, నాయకులు రమేష్, కసిరెడ్డి చైతన్యరెడ్డి, దైద వెంకటేశ్వర్లు, సయ్యద్ ఫారూఖ్, వీరబోయిన సైదులు, మాదవరెడ్డి, మధన్‌నాయక్, సుధాకర్, గఫార్, నగేష్, సైదులు, నసిరుద్దీన్‌బాబా, ఇబ్రహీం, కలీం, రవినాయక్, వెంకన్న, సురేష్, సతీష్, నగేష్, ఎల్లయ్య పాల్గొన్నారు.

హరితవనంలా పాఠశాల ఆవరణ


విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న తూడి వెంకట్‌రెడ్డి(ఫైల్)


ఏపుగా పెరిగిన మొక్కలు

- నెరవేరిన ప్రధానోపాధ్యాయుడి సంకల్పం
- నాడు విద్యార్థులతో కలిసి నాటిన మొక్కలు నేడు చెట్లు
- ఒక్కో విద్యార్థికి 10 మొక్కల సంరక్షణ బాధ్యతలు

త్రిపురారం : నాడు ఉపాధ్యాయుడు నాటిన మొక్కలు నేడు వృక్షాలై నీడనిస్తున్నాయి. దీంతో ఆ పాఠశాల ఆవరణ పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతోంది. ఆ పాఠశాల ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటుగా చల్లటి గాలులు వీస్తూ పాఠశాలే హరితవనంగా దర్శనమిస్తోంది. త్రిపురారం మండలంలోని బాబుసాయిపేట గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలకు తూడి వెంకట్‌రెడ్డి 2015లో ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆ పాఠశాలకు సుమారు 2 ఎకరాల్లో ఖాళీ స్థలం ఉంది. మొక్కలు పెంచడం అంటే ఇష్టం ఉన్న ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి హరితహారం కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో 2016లో విద్యార్థులతో కలిసి సుమారు 200 మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. ఒక్కో చెట్టుకు ఒక్కో స్వాతంత్ర్య సమర యోధులు, ప్రముఖుల పేర్లు పెట్టారు. ప్రతి విద్యార్థికి 10 మొక్కల చొప్పున సంరక్షణ బాధ్యతలు అప్పగించారు. దీంతో నాటు నాటిన మొక్కలు పెరిగి పెద్ద వృక్షల్లా మారి అడవిని తలపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడు తూడి వెంకట్ రెడ్డి పెద్దవూర మండలంలోని ఏనెమీదిగూడెంలో విధులు నిర్వహిస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా నీరందించాం

హరితహారాన్ని దృష్టిలో ఉంచుకొని మండలంలో ఉన్న అన్ని పాఠశాలలకు ఆదర్శంగా ఉండేందుకు పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షించాం. మొక్కలు నాటిన సమయంలో నాలుగేళ్ల వర్షాలు సరిగా కురువ లేవు. అయినా ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాం. పాఠశాల ఆవరణ అంత హరితవనంలా మారింది. పాఠశాలలో ఎక్కువ చెట్లు ఉండడంతో విద్యార్థులు చెట్ల కింద ఆడుకోవడం, మధ్యాహ్న భోజనం కూడా చెట్ల కింద కూర్చొని ప్రశాతంగా తినేవారు. పచ్చటి వాతావరణం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారు. నాడు నాటిన మొక్కలు వృక్షాలు కావడంతో సంతోషంగా ఉంది. పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షించడంలో విద్యార్థులు, తోటి ఉపాధ్యాయుల కృషి మరువలేనిది.

– తూడి వెంకట్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం


హజారుగూడెంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

- సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి

హాలియా : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి అన్నారు. శనివారం అనుముల మండలంలోని హజారు గూడెంలో 85మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్ కాపీలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సాగర్ నియోజకవర్గంలో ఏ ఒక్కరికి కూడా ఇళ్లు ఇవ్వకుండా మాయ మాటలతో ప్రజలను మోసం చేసిందన్నారు. సాగర్ నియోజకవర్గానికి మొదటి విడతగా 3500 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇళ్లు రాని నిరుపేదలేవరూ ఆందోళన చెందవద్దని, విడతల వారీగా అర్హులందరికీ ఇళ్లు ఇస్తామన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి మళ్లీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని ఎమ్మెల్యే వాగ్దానం చేశారు. 2008లో హజారుగూడెం గ్రామ ప్రజలకు తన తండ్రి కుందూరు జానారెడ్డి ఇచ్చిన మాట నేడు సాకారం అయ్యిందని అందుకు ప్రజలు జానారెడ్డికి కృతజ్ఞతలు తెలపడంతో పాటు ఈ కాలనీకి తన పేరు కాకుండా తన తండ్రి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పేరును పెట్టుకోవాలని ప్రజలకు సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తుందని పేర్కొన్నారు. అలాగే మండలంలోని వీర్లగడ్డతండాలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యడవెల్లి నరేందర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, కుంటిగొర్ల శ్రీనివాస్ యాదవ్, రావుల రాంబాబు, రిక్కల సుధాకర్‌రెడ్డి, రావుల శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గౌనీ రాజా రమేష్ యాదవ్, మజహర్ మొహినుద్దీన్, అన్వరుద్దీన్, నకిరేకంటి సైదులు మాదిగ, బాన్‌చందర్ రెడ్డి, గౌస్, తహసిల్దార్ రఘు, ఆర్ఐ నవీన్ ఉన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం


మాడుగులపల్లిలో సమీకృత భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం

మాడుగులపల్లి : రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం మాడుగులపల్లి మండల కేంద్రంలో రూ.14.70 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయ భవన సముదాయానికి శంకస్థాపన చేశారు. అనంతరం రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని, పేదల ఆకలి తీర్చడానికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. బీసీల సమగ్రాభివృద్ధికి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, మాజీ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, యువ నాయకులు గడ్డం పురుషోత్తంరెడ్డి, ఎంపీడీఓ తిరుమలస్వామి, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏపీఎం బాషపాక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి నాబార్డు కృషి

దేవరకొండ: రైతుల సంక్షేమానికి నాబార్డు కృషి చేస్తుందని ఆ బ్యాంక్ డీడీఎం వినయ్‌కుమార్ అన్నారు. నాబార్డు 44వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేవరకొండ మండల పరిధిలోని అచ్చమ్మకుంట తండాలో యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాబార్డు ఆధ్వర్యంలో సన్న, చిన్నకారు రైతుల సంక్షేమానికి ఎన్నో రకాల కార్యక్రమాలను చేపట్టినట్లు గుర్తుచేశారు. అనంతరం గ్రామస్తులకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్ అధ్యక్షుడు ఖాజాఖైరత్‌అలీ, ఆల్య, కోట్య, శంకర్ పాల్గొన్నారు.


గ్రామస్తులకు జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్

మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి


సత్యనారాయణను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మున్నూరు కాపుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కోశాధికారి కంచి సత్యనారాయణ అన్నారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికైన సత్యనారాయణను శనివారం పట్టణంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో సన్మానించారు. ఈ సందర్భంగా కంచి సత్యనారాయణ మాట్లాడుతూ మున్నూరు కాపులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకునేందుకు సిద్ధం కావాలన్నారు. తన నియమకానికి అన్ని విధాలుగా సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షులు పందిరి వేణు, ఉపాధ్యాయులు అక్కి శ్రీనివాస్, పులిజాల విష్ణుకుమార్, అంబటి శ్రీనివాస్, సైదులు, ఆవుల శ్రీనివాస్ నాయుడు, సోమగాని వెంకట మహేష్, బచ్చలకూరి వీరశేఖర్, కంచి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన బొల్లెపల్లి జానయ్యగౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి శనివారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జానకిరాములు, లింగయ్య, సైదులు, గిరిబాబు, శ్రీనివా స్‌రెడ్డి, రమణయ్య, వెంకన్న, జానకిరాంరెడ్డి, యాదగిరి, సతీష్, భీమయ్య, జగన్, సైదులు, మల్లయ్య, రాజు, పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

- మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై పంపిన తీర్మానంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్‌లో ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి ఎందుకు తేవడం లేదని ఆయన ప్రశ్నించారు. బిల్లు ఆమోదం కోసం కేంద్రం వద్ద రేవంత్‌రెడ్డి ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. పార్లమెంట్‌లో కేంద్రం రిజర్వేషన్లపై చట్టం చేస్తేనే రిజర్వేషన్లు అమలవుతాయని ముఖ్యమంత్రికి కూడా తెలుసన్నారు. ఆర్డినెన్స్ పేరుతో స్థానిక ఎన్నికలు వాయిదా వేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. బీసీ ప్రజానీకాన్ని మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఘరానా మోసానికి పాల్పడుతుందని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు టీవీఎన్ రెడ్డి, వల్లపురెడ్డి, ముక్కమళ్ల బాలయ్య, చింతపల్లి సుభాష్, గాజుల ఆంజనేయులు, అర్వపల్లి సరిత, జనార్ధన్‌రావు, నీల రవికుమార్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, శ్రీను, మహేందర్, రాములు, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

హాలియా : పంజాబ్ నేషనల్ బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం పరమశివం అన్నారు. శనివారం హాలియా నూతనంగా ఏర్పాటు చేసిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ హాలియా బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి తమ బ్యాంకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా తమ బ్యాంకు సేవలు విస్తరిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్త మెగా అగ్రి అవుట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా దేశంలో 200బ్రాంచ్‌లలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.అనంతరం రూ. 50 కోట్లకుపైగా విలువ గల 25 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ జోనల్ ప్రధాన అధికారి సునీల్‌కుమార్ చుక్, జోనల్ హెడ్ లాలా లజపతిరాయ్, సర్కిల్ హెడ్ అరవింద్ కల్రా, ఆల్ ఇండియా పంజాబ్ నేషనల్ బ్యాంకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి వెంకన్న, వైస్ ప్రెసిడెంట్ నాని కిశోర్, జిల్లా రైస్ మిల్లర్స్ గౌరవాధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, వీరమల్ల శ్రీనివాస్, తీగల తిలక్ తదితరులు పాల్గొన్నారు.


పంజాబ్ నేషనల్ బ్యాంక్ హాలియా బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరమశివం

సమస్యలు పరిష్కరించరూ..


విద్యుత్ సమస్య పరిష్కరించాలని కోరుతూ రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు(ఫైల్)


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జంగాల కాలనీవాసులు(ఫైల్)


- డిండి మండల కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- సక్రమంగా రాని భగీరథ నీరు
- విద్యుత్ సమస్యతో సతమతం
- సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తుల రాస్తారోకో

డిండి: జిల్లా కేంద్రానికి దాదాపు 100 కిలో మీటర్లు.. అభివృద్ధి కి ఆమడ దూరంలో డిండి మండల కేంద్రం ఉంది దీనికి తోడు డిండి గ్రామ పంచాయతీ నిండా కొన్నేళ్ల నుంచి వివిధ రకాల సమస్యలు తిష్ట వేశాయి. దీంతో గ్రామస్తుల బాధలు వర్ణనాతీతంగా మారింది. ప్రభుత్వ అధికారులు స్థానికంగా ఉండక పోవడంతోపాటు గ్రామంలో తిష్ట వేసిన సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారం రోజుల నుంచి సంబంధిత కార్యాలయాల వద్దకు వెళ్లి గ్రామస్తులు వెంటనే సమస్యలు పరిష్కరించాలని వినతులు ద్వారా అధికారులను నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టక పోతే భవిష్యత్‌లో స్థానికంగా ఆందోళన కార్యక్రమాలు చేపడ్తామని కూడా వారు హెచ్చరిస్తున్నారు.

ప్రజలు ఎదుర్కొంటున్న కొన్ని ప్రధాన సమస్యలు

- 2009లో ఎలాంటి కారణం లేకుడా అప్పటి అధికారుల తప్పిదం వలన రైతులు కోల్పోయిన పొలాలకు తిరిగి పట్టాలు ఇప్పించాలని జూన్ 16న రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు.
- డిండి మండల కేంద్రంలో కొన్ని నెలల నుంచి విద్యుత్ సమస్యతో సతమవుతున్నారు. దీంతో గ్రామస్తులు జూలై 8న రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు.
- జనాభా సంఖ్య ఆధారంగా కాకుండా మిషన్ భగీరథ తాగునీరు అరకొరగా వస్తున్నాయి. దీంతో పలువురు నాయకులు జూలై 10న ఎంపీడీఓతో సమావేశమై చర్చించారు.
- స్థానిక బుడిగ జంగాల కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ తీరు సరిగ్గా లేక రోగాల బారిన పడుతున్నామని, నివసించడానికి ఇళ్లు లేవని తదితర సమస్యపై జూలై 3న పంచాయతీ సిబ్బందికి, శుక్రవారం దేవరకొండలో ఎమ్మెల్యే బాలునాయక్‌కు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు.
- స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి లేక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చాలి



బుడిగ జంగాల కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీంతో దోమల కాటుకు గురై రోగాల బారీన పడుతున్నాం. పలుమార్లు సబంధితాధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. వెంటనే కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి

– ఏముల శ్రీను, జంగాల కాలనీ

సమస్యలు పరిష్కరిస్తాం



డిండి పట్టణంలో పలు సమస్యలు నెలకొన్నాయని పలువురు గ్రామస్థులు నా దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని ఆయా శాఖలాధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తా.

– వెంకన్న ఎంపీడీఓ, డిండి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వేములపల్లి: బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వేములపల్లి మండల కేంద్రం శివారులోని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై శనివారం జరిగింది. ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం గుర్రప్పగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కోయల్‌పహాడ్ గ్రామానికి పందిరి రాంబాబు కుటుంబంతో కలిసి మిర్యాలగూడలోని సంతోష్‌నగర్‌లో నివాసముంటున్నాడు. శనివారం మధ్యాహ్నం రాంబాబు తన భార్య అనిత, ఇద్దరు కుమారులు హర్షద్‌కుమార్, అక్షయ్‌కుమార్‌తో కలిసి బైక్‌పై స్వగ్రామం కోయల్‌పహాడ్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో వేములపల్లి మండల కేంద్రం శివారులోని డ్రీమ్ స్టూడియో సమీపంలోకి చేరుకోగానే వేములపల్లి నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న టిప్పర్ వెనుక నుంచి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రాంబాబుకు, అతడి భార్య అనిత, చిన్న కుమారుడు అక్షయ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్షయ్‌కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాంబాబు తండ్రి భిక్షం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అభాగ్యుడిని చేరదీసి తల్లిదండ్రుల వద్దకు చేర్చాడు

- యూపీ నుంచి దారితప్పి వచ్చిన షకీర్
- ఆశ్రయమిచ్చిన పెద్దవూరకు చెందిన షబ్బీర్
- అడ్రస్ తెలుసుకొని సొంతూరికి రైలులో పంపిన మానవతావాది


షకీర్‌ను బైక్‌పై తీసుకెళ్తున్న షబ్బీర్


ఇంటికి చేరిన తర్వాత తల్లితో షకీర్

పెద్దవూర: ఊరుగాని ఊరు, రాష్ట్రం గాని రాష్ట్రంలో ఇక్కడ మాట్లాడే భాష రాక ఎక్కడో తప్పిపోయి తన గమ్యం ఏంటో ఎటు పోవాలో తెలియక రోడ్ల వెంట నడుస్తు వెళ్తున్న మానస్థితి సరిగా లేని అభాగ్యుడిని చేరదీసి క్షేమంగా ఇంటికి చేర్చి మానవత్వాన్ని చాటుకున్నాడు మండల కేంద్రానికి చెందిన ఎండీ.షబ్బీర్. గత వారం రోజుల క్రితం షబ్బీర్ తన బైక్‌పై తన చిన్న కూతురుని తీసుకుని హాలియాకు వెళ్లి వస్తుండగా చింపిరి జుట్టుతో, మాసిన బట్టలతో ఒంట్లో సత్తువ లేక రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి కనిపించాడు. నడవలేని పరిస్థితిలో అతడిని చూసి చలించిపోయాడు. తన వద్ద ఉన్న మామిడి కాయను ఇచ్చేద్దామని అనుకున్నాడు. కానీ పిచ్చోడేమో దగ్గరికి వెళ్తే రాళ్లతో కొడతాడేమోనని కొద్దిదూరంలో ఆగి తన కూతురును బైక్‌పైనే ఉంచి అతడి దగ్గరికి వెళ్లి పండు ఇస్తే తీసుకున్నాడు. అతడిని పలుకరించగా హిందీలో మాట్లాడాడు. హిందీ భాష వచ్చిన షబ్బీర్ నీపేరు ఏంటని, ఎక్కడి వెళ్లాలి, ఏ ఊరు అని ఆరా తీశాడు. పండు తినుకుంటునే తన పేరు షకీర్, తనది ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం మీరట్ అని చెప్పాడు. తను రెండు నెలల క్రితం తన గ్రామంలోనే రైలు ఎక్కానని, ఆ తర్వాత ఎక్కడ దిగానో తెలియదని అప్పటి నుంచి కనిపించిన రోడ్డు వెంట నడుచుకుంటూ తిండీతిప్పలు లేకుండా ఎవరైనా పెడితే తినడం లేదంటే ఖాళీ కడుపుతో ఉంటున్నానని తెలిపారు. దీంతో షబ్బీర్ తన వెంట వస్తావా. మీ ఇంటికి పంపిస్తా అని చెప్పడంతో షకీర్ ఒకే అన్నాడు. దీంతో అతడిని బైక్‌పై పెద్దవూరకు తీసుకెళ్లాడు. కటింగ్, సేవింగ్ చేయించి కొత్త దుస్తులు ఇచ్చి స్నానం చేయించి తన వద్దే మూడు రోజులు ఉంచుకున్నాడు.

గూగుల్ మ్యాప్ ద్వారా అడ్రస్ తెలుసుకొని..

ఇంటికి పంపించాలంటే కనీసం అతడికి ఏ ఫోన్ నంబర్ గుర్తు లేదు. దీంతో అడ్రస్ ఎలా కనుక్కునేది అని ఆలోచించి గూగుల్ మ్యాప్‌లో మీరట్, హైదర్‌నగర్ అని కొట్టి చూడగా అక్కడ హైదర్ హైస్కూల్ అని బోర్డు కనిపించడంతో ఇది మీ వీధినే అని అడగటంతో అవును అని చెప్పాడు. గూగుల్ మ్యాప్‌లోనే ఆ వీధిలోని ఒక ఫ్లెక్సీ కనిపించడం, దానిపై ఒక ఫోన్ నంబర్‌కు ఫోన్ చేశాడు. ఇక్కడ మీ వీధిలోని ఒక వ్యక్తి తప్పిపోయి తెలంగాణ రాష్ట్రం పెద్దవూరలో ఉన్నాడు అని చెప్పి వీడియో కాల్ చేసి చూపించాడు. దీంతో అతడిని గుర్తు పట్టిన అవతలి వ్యక్తి అతడి ఇంటికి వెళ్లి ఫోన్ నంబరు ఇచ్చి, తల్లి, సోదరుడితో మాట్లాడించాడు. అతడి అతడి స్వగ్రామం పంపుదామంటే కనీసం ఆధార్ కార్డు కూడా లేదు. అతడి అన్నకు ఫోన్ చేసి ఆధార్ కార్డును వాట్సాప్ లో పంపించమని అడగా పంపించాడు. అతడిని ఢిల్లీకి రైలులో పంపిస్తానని అక్కడికి వచ్చి తీసుకెళ్లాలని చెప్పి ఢిల్లీ నిజాముద్దీన్ రైలులో ఏసీ త్రీటైర్‌లో టిక్కెట్ బుక్ చేశాడు. జనరల్ బోగీలో అయితే ఎక్కడ దిగుతాడోనని డబ్బులు ఎక్కువైనా పర్వాలేదని ఏసీ త్రీటైర్ టిక్కెట్ తీసుకొని అందులో ఎక్కించాడు. ఒక బ్యాగులో అతడికి రెండు రోజులకు సరిపోయేలా అల్పాహారం, భోజనాన్ని పార్శిల్ చేసి పెద్దవూర నుంచి హైదరాబాద్‌కు బస్సులో తీసుకెళ్లి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి రైలులో ఎక్కించి గార్డుకు రూ.500లు ఇచ్చి చివరి స్టేషన్ నిజాముద్దీన్ స్టాప్ లో దింపాలని చెప్పాడు. అలాగే టిక్కెట్ కలెక్టర్‌తో సైతం చెప్పి తగిన జాగ్రత్తలు చెప్పి పంపించాడు. ఢిల్లీలో దిగగానే అతడి తల్లి, సోదరుడు వచ్చి షకీర్‌ను తమ వెంట తీసుకెళ్లారు. తమ కుమారుడిని తమ వద్దకు పంపించిన షబ్బీర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తన కుమారుడి కోసం మొక్కని దేవుడు లేడని, ఆ దేవుడే నీ రూపంలో పంపించాడని ఆనందం వ్యక్తం చేసింది ఆ తల్లి. గతంలోనూ ఇద్దరిని ఇలాగే మతిస్థిమితం లేని వ్యక్తులను వారి స్వగ్రామాలకు పంపించిన షబ్బీర్‌ను పలువురు అభినందించారు.